సాక్షి ఖమ్మం
శనివారం । 20 । జూలై । 2024



నిండా ముంచిన నిర్లక్ష్యం
అశ్వారావుపేట సమీపాన పెదవాగు ప్రాజెక్టుకు గండి పడడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా గుర్తించారు. 8లో



మత్స్యకారులకు ప్రమాదబీమా
మత్స్య సహకార సంఘాల సభ్యులై ఉండి 18నుంచి 70ఏళ్ల లోపు వయసు కలిగిన వారికి బీమా సౌకర్యం వర్తించనుంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
28° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్

సాక్షి ఫోన్ ఇన్

జిల్లాలోని సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల పరిధిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజలు తమ సమస్యలను వివరించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈసందర్భంగా ఆయా మున్సిపాలిటీల ప్రజలు సీజనల్ వ్యాధుల నేపథ్యాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడంతో పాటు ఓపెన్ ప్లాట్లు, ఖాళీస్థలాల్లో చెత్త నిల్వలు, డ్రెయినేజీలు, రోడ్లు సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ల దృష్టికి తీసుకురావొచ్చు.

సత్తుపల్లి

తేదీ: 20-07-2024, శనివారం
సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు
97053 46758, 98665 73055



మందా రవిబాబు,
మున్సిపల్ కమిషనర్

వైరా

తేదీ: 20-07-2024, శనివారం
సమయం : ఉదయం 11-30 నుంచి 12-30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ **73965 07165**



చింత వేణు,
మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

'బెస్ట్ అవైలబుల్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా 2024–25 ఏడాదికి గాను ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు గిరిజన తెగల విద్యార్థులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో సూచించారు. తరగతుల వారీగా లంబాడీ, నాయక్‌పోడు, గోండు, కోయ, ఎరుకల తదితర తెగల విద్యార్థులకు అవకాశముందని తెలిపారు. కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలతో పాటు గత ఏడాది స్టడీ సర్టిఫికెట్ జత చేసి ఈనెల 26వ తేదీలోగా కార్యాలయంలోనే సమర్పించాలని సూచించారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 31న నిర్వహించే లాటరీ విద్యార్థులకు విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎంఓగా కళావతిబాయి



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ(రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)గా డాక్టర్ కళావతిబాయి నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను ఇక్కడకు కేటాయించారు. ప్రస్తుతం కళావతిబాయి మహబూబాబాద్ డీఎంహెచ్ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆమె ఇక్కడ కూడా డీఎంహెచ్ఓగా పనిచేశారు.

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల

- జిల్లాలో మల్టీపర్పస్ వర్కర్లకు రూ.7.49 కోట్లు

నేలకొండపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలకు సంబంధించి ఎట్టకేలకు నిధులు విడుదలయ్యాయి. జీపీల్లోని మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రభుత్వం నుంచి నెలల తరబడి వేతనాలు రావడం లేదు. జిల్లాలో 589 జీపీలకు గాను నిధుల లభ్యత ఉన్నచోటఅధికారులు వేతనాలు అందిస్తున్నారు. అయితే, సుమారు 552 గ్రామ పంచాయతీల్లో నాలుగు నెలల నుంచి ఏడు నెలల మేర వేతనాలు రాకపోవడంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఈనేపథ్యాన ఆయా జీపీలకు గాను రూ.7,49,55,000ను తాజాగా విడుదల చేశారు. ఇందులో ఖమ్మం సబ్‌ట్రెజరీ కార్యాలయ పరిధిలో 213 జీపీలకు రూ.3,10,75,000, మధిర ట్రెజరీ కార్యాలయ పరిధిలో 74 జీపీల సిబ్బందికి రూ.78,37,500, సత్తుపల్లి సబ్ ట్రెజరీ పరిధిలో ఉన్న 77 జీపీల్లో వర్కర్ల వేతనాలకు రూ.89,96,500, వైరా ట్రెజరీ పరిధిలోని 99 జీపీలకు సంబంధించి కార్మికుల వేతనాలకు రూ.1,60,26,500, నేలకొండపల్లి ఎస్టీఓ పరిధిలోని 89 గ్రామపంచాయతీల మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల కోసం రూ.1,10,19,500 జమ అయ్యాయి. ఈ నిధులను శనివారం నుంచి సిబ్బంది ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

అయోమయం.. ఆగమాగం



రుణమాఫీ వర్తించడంతో కారేపల్లి బ్యాంకులో ధ్రువపత్రాల జిరాక్స్‌లు అందజేస్తున్న రైతులు

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ఆధారంగా ఖాతాల్లో నగదు జమ అయిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. అందని వారిలో అయోమయం నెలకొంది. జాబితాలో పేర్లు లేవని గుర్తించిన పలువురు పీఏసీఎస్‌లు, బ్యాంకుల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నా ఫలితం కానరావడం లేదు. మాఫీ నిబంధనలు, ప్రక్రియ గందరగోళంగా ఉండడంతోనే ఇలా జరిగిందని ఆందోళన చెందుతున్నారు. డీసీసీబీ పరిధిలోని పీఏసీఎస్‌లను పరిశీలిస్తే రూ.లక్షలోపు రుణం తీసుకున్న 30 శాతం మందికే మాఫీ వర్తించగా.. మిగతా వారు వెళ్లి అడిగితే వ్యవసాయశాఖ, బ్యాంకుల అధికారులు రకరకాల కారణాలు చెప్పి తిప్పి పంపిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

30 శాతం లోపు రైతులకే రూ.లక్ష రుణమాఫీ

- సొసైటీలు, బ్యాంకుల వద్ద పలువురి ఆరా
- అర్హత ఉన్నా మాఫీ కాకపోవడంపై అన్నదాతల్లో ఆందోళన
- గందరగోళంగా నిబంధనలు, ప్రక్రియ
- సందేహాల నివృత్తికి 1950, 90632 11298కు ఫోన్ చేయాలని అధికారుల సూచన

అసలు అర్హులు ఎందరు?

జిల్లాలో సుమారు 3.21లక్షల మంది రైతులు రూ.2,300 కోట్ల మేర పంట రుణం తీసుకున్నారు. వీరందరూ రుణమాఫీకి అర్హులుగానే గుర్తించినట్లు సమాచారం. కానీ ప్రభుత్వం మూడు విడతలుగా రూ.లక్ష, రూ.1.50లక్షలు, రూ.2లక్షల మేర రుణాలు మాఫీ చెస్తామని చెప్పినా అర్హులు ఎంత మంది అన్నది జిల్లాస్థాయిలో ఎక్కడా ప్రకటించలేదు. మరోపక్క జిల్లాలో రూ.లక్ష లోపు 57,857 మంది రైతులకు తొలి విడత మాఫీ జరిగినట్లు చెబుతున్నారు. ఈ విడతలో అర్హులు చాలామందికి రుణమాఫీ వర్తించకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు.

పీఏసీఎస్‌లనే తీసుకుంటే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌ల్లో సగటున 26 శాతం వరకు మాత్రమే రుణమాఫీ జరిగింది. డీసీసీబీ పరిధిలో అన్ని పీఏసీఎస్‌లు కలిపి రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారు 1,43,327 మంది ఉండగా.. వీరిలో కేవలం 37,625 మంది రైతులకే రుణమాఫీ అమలైంది. ఇతర వాణిజ్య బ్యాంకుల్లో ఇదే తరహాలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రునాలు తీసుకున్న రైతులు శుక్రవారం ఆయా కేంద్రాల వద్దకు వెళ్లి సిబ్బందిని ఆరా తీశారు. కొందరు రకరకాల కారణాలు చెప్పగా.. ఇంకొన్ని బ్యాంకుల్లో మాత్రం ప్రభుత్వ జాబితా ప్రకారమే మాఫీ జరిగిందని చెప్పి పంపారు.

ఇవి కారణాలు కావొచ్చు...

రుణమాఫీ మార్గదర్శకాలను ఈనెల 15న ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రైతు కుటుంబాన్ని గుర్తించడానికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటామని పేర్కొన్నారు. దీనిపై విమర్శలు రావడంతో రేషన్‌కార్డు లేకున్నా అర్హులందరికీ రుణమాఫీ అందుతుందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఒక బ్యాంక్‌లో రూ.లక్షలోపు పాస్ పుస్తకం పెట్టి రుణం తీసుకుని, మరో బ్యాంకులో బంగారం పై రుణం తీసుకున్న వారు, రేషన్‌కార్డు లేని వారు.. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురి పేరిట బ్యాంకుల్లో రూ.2 లక్షల పైన రుణాలు ఉన్నా లేదంటే వ్యక్తిగత ఖాతాల్లో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారికి మాఫీ కాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ఇవేవీ తమకు వర్తించకున్నా మాఫీ కాలేదని పెద్దసంఖ్యలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెంబర్లకు కాల్‌చేయండి..

జిల్లాలో 57,857 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు. ఈనేపథ్యాన సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన 1950 లేదా 9063211298 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల సూచించారు. అలాగే, మండల, జిల్లాస్థాయి వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులు సంప్రదించొచ్చని తెలిపారు.

రూ.40 వేలు మాఫీ కాలే..



పెనుబల్లి మండలం వీ.ఎం.బంజరకు చెందిన పాలెపు వెంకటేశ్వరరావు 2023 అక్టోబర్ 9న పెనుబల్లి పీఏసీఎస్‌లో పాస్‌పుస్తకం ఆధారంగా రూ.40 వేలు రుణం తీసుకున్నాడు. ఆయన, కుటుంబీకుల పేరిట ఇతర బ్యాంకుల్లో రుణం లేదు. అయితే, రేషన్‌కార్డు లేకపోగా వ్యవసాయంతోపాటు కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. కిరాణాషాపు పేరుతో జీఎస్టీ నంబర్ నమోదై ఉండడం.. రేషన్‌కార్డు లేకపోవడం కారణమో తెలియదు కానీ రుణం మాత్రం మాఫీ కాలేదు.

అధికారులకూ తెలియదట..



బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన ఆవుల శ్రీను పీఏసీఎస్‌లో 2022లో ఎకరం పట్టాదార్ పాస్ పుస్తకం పెట్టి రూ.25వేల రుణం తీసుకున్నాడు. రెండేళ్ల పాటు వడ్డీ కట్టి రెన్యువల్ చేయించాడు. ప్రస్తుతం రూ.25,964 రుణం ఉంది. అయినా మాఫీ వర్తించలేదు. ఈ రైతు మరే బ్యాంక్‌లో కూడా రుణం తీసుకోలేదు. రేషన్‌కార్డు సైతం కూడా ఉంది. తనకు ఎందుకు మాఫీ కాలేదని అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని శ్రీను ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



కూసుమంచి ఏఓ కార్యాలయంలో వివరాలు ఆరా తీస్తున్న రైతులు

కొన్ని పీఏసీఎస్‌ల్లో ఇలా...

- బోనకల్ మండలం ముష్టికుంట్ల పీఏసీఎస్‌లో మొత్తం 1,188 మంది రైతులకు రూ.6.87 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. ఇందులో రూ.లక్ష లోపు అప్పు ఉన్న 966 మంది రైతులకు రూ.4,09,13,000 మాఫీ కావాలి. కానీ 519 మంది రైతులకే మాఫీ వర్తించగా 447 మందికి కాలేదు.
- పెనుబల్లి పీఏసీఎస్ పరిధిలో మొత్తం 2,713 మంది రైతులు 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య రూ.14,68,09,701 రుణాలు తీసుకున్నారు. వీరిలో 2,203 మంది రైతులు రూ.లక్ష లోపు రుణాలు తీసుకుంటే కేవలం 376 మందికి రూ 1,53,57,543 మాత్రమే మాఫీ అయ్యాయి. దీంతో మిగతా 1,827 మంది రైతులు ఏం జరిగిందో తెలియక ఆందోళన చెందుతున్నారు.
- రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ పరిధిలో 3,317 మంది రైతులకు వడ్డీతో కలిపి రూ.17,35,63,965 కోట్ల రుణం ఉంది. వీరిలో రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులు రూ.3,037 మంది ఉండగా.. 440 మందికే రూ.1,75,38,906 మాఫీ అయింది. ఇంకా 2,597 మంది మిగిలిపోయారు.
- తల్లాడ సొసైటీలో రూ.2 లక్షల రుణమాఫీకి అర్హులుగా 2,303 మందిని గుర్తించారు. రూ.లక్షలోపు రుణమాఫీకి 2,160 మంది అర్హులుగా తేలగా 247 మందికి రూ.62,15,229 మాఫీ అయింది. ఇంకా రూ.లక్షలోపు రుణమాఫీకి అర్హులైన 1,913 మంది ఎదురుచూస్తున్నారు.
- సత్తుపల్లి సొసైటీలో 761 మంది రైతులు రుణాలు తీసుకోగా, రూ.లక్ష లోపు రుణం కలిగిన 502 మందికి గాను 232 మందికే మాఫీ వర్తించింది. ఇందులో మిగిలిన వారితో పాటు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలలోపు రుణం తీసుకున్న 249 మంది, రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల్లోపు రుణం తీసుకున్న రైతులు 10 మంది ఉన్నారు.

పరిశీలనకు అధికారుల నియామకం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో రైతుల రుణమాఫీ అమలు పరిశీలనకు సహకార శాఖకు చెందిన అధికారులను నియమించారు. వివిధ స్థాయి అధికారులు 45 మందిని డీసీసీబీ బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌ల్లో పరిశీలన కోసం కేటాయించారు. వాణిజ్య బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల ఖాతాల్లో మాఫీ నగదు నేరుగా జమ చేయగా డీసీసీబీల్లో మాత్రం ప్రధాన ఖాతాకే జమ అయ్యాయి. ఆపై రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఈమేరకు అధికారులను కేటాయించగా జిల్లాలోని 76 పీఏసీఎస్‌లతో పాటు డీసీసీబీ బ్రాంచ్‌ల్లో ప్రక్రియను వీరు పర్యవేక్షించనున్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. జిల్లాలో ఆరు కేంద్రాల్లో ఉదయం సెషన్‌కు 952మందిలో గాను 863మంది, మధ్యాహ్నం పరీక్షకు 793మందిలో 756మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

నేడు పాలేరుకు సాగర్ జలాలు

ఖమ్మంవన్‌టౌన్: వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరగా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ జలాలు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎన్నెస్పీ సీఈలకు మంత్రి చేసిన సూచనలతో ఎడమ కాల్వ ద్వారా శుక్రవారం నీటిని విడుదల చేశారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు శనివారం కల్లా చేరుతాయని అధికారులు వెల్లడించారు.

నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం: భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. ఎగువన నుంచి వరద వస్తుండడంతో శుక్రవారం ఉదయం 24.5 అడుగుల వద్ద ఉన్న ప్రవాహం రాత్రి 10 గంటలకు 27.08 అడుగులకు చేరింది. ప్రవాహ ఉధృతి కొనసాగుతుండటంతో మరో రెండు అడుగుల మేర పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. దుమ్ముగూడెంలోకి వరద నీరు చేరకుండా స్లూయిస్ వద్ద ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. పర్ణశాలలోని సీతమ్మవారి నారచీరల ప్రాంతమంతా మునిగింది. కాగా, భద్రాచలం వద్ద గోదావరి జలకళ సంతరించుకోవడంతో పలువురు నదిని చూసేందుకు తీరానికి తరలివస్తున్నారు. సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవనాలు

మంత్రి పొంగులేటి సూచనలతో జేఎన్‌టీయూ, రెవెన్యూ అధికారుల సర్వే

ఖమ్మంరూరల్: జిల్లా విద్యార్థులు ఇంజనీరింగ్ చదివేందుకు దూరప్రాంతాలకు వెళ్లకుండా జేఎన్‌టీయూ ఆధ్వర్యాన ప్రభుత్వ కళాశాలను గత ఏడాది మంజూరు చేశారు. ఈ కళాశాలను పాలేరు నియోకవర్గానికి కేటాయించగా తొలి ఏడాది తరగతులు పూర్తయ్యాయి. మొదటి సంవత్సరం తాత్కాలిక భవనాల్లో కళాశాల నిర్వహించగా... ప్రస్తుతం శాశ్వత భవన నిర్మాణానికి రంగం సిద్ధమైంది. పాలేరు ఎమ్మెల్యేగా గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర మంత్రి పదవి దక్కడంతో ప్రత్యేక దృష్టి సారించిన ఆయన భవన నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. దీంతో జేఎన్‌టీయూ, రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు.

మద్దులపల్లిలో తరగతులు

ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవనాలు అందుబాటులో లేక తొలి ఏడాది ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి సమీపాన వైటీసీ భవనంలో తరగతులు నిర్వహించారు. ఈ భవనంలో బోధన, ప్రాక్టికల్స్‌కు సరైన వసతులు లేక ఇక్కట్లు ఎదురయ్యాయి. తొలి ఏడాది సీఎస్ఈ, ఈసీఈ, డేటాసైన్స్ కోర్సులకు గాను సీఎస్ఈలో 38 మంది, డేటా సైన్స్‌లో ఆరుగురు కలిపి కేవలం 44మంది మాత్రమే చేరడానికి భవనాలు సరిగ్గా లేకపోవడమే కారణమని తెలిసింది. అయితే, గత ఏడాదే మద్దులపల్లిలో 30ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం గుర్తించినా నిర్మాణాలు మొదలుకాలేదు. ఇప్పుడు మంత్రి పొంగులేటి సూచనలతో జేఎన్‌టీయూ అధికారులు శుక్రవారం మద్దులపల్లిలో భూమిని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కానున్నాయని తెలుస్తుండగా విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి. సర్వేలో జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు డాక్టర్ వి.వెకటేశ్వరరెడ్డి, డాక్టర్ బి.రవీంద్రారెడ్డి, డాక్టర్ డి.రమేష్, సర్వేయర్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

275మంది విద్యార్థుల ఆప్షన్

పాలేరు నియోజకవర్గంలోని ఇంజనీరింగ్ కళాశాలకు ఈ ఏడాది 330 సీట్లు మంజూరయ్యాయని ప్రిన్సిపాల్ రమేష్ వెల్లడించారు. సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, డేటాసైన్స్‌లో ఈ సీట్లు కేటాయించగా మొదటి దశ కౌన్సిలింగ్‌లో 275మంది ఆప్షన్ ఇచ్చుకున్నారని తెలిపారు.



మద్దులపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

సాధారణానికి మించి..



ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ వద్ద రహదారిపైకి చేరిన వరదలో వెళ్తున్న వాహనదారులు

- జిల్లావ్యాప్తంగా వర్షం
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- అన్నదాతల్లో భరోసా నింపుతున్న వాన
- వరి, ఇతర పంటల సాగుకు అనుకూలం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజుల క్రితం మొదలైన వర్షం శుక్రవారం కూడా కొనసాగింది. శుక్రవారం ఉదయం 8-30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అధికారిక గణాంకాల ప్రకారం అత్యధికంగా కామేపల్లి మండలం లింగాలలో 43.0 మి.మీ.ల మేర వర్షపాతం నమోదైంది. కాగా, జూన్‌లో సాధారణానికి మించి వర్షపాతం నమోదు కాగా, ఈనెలలో 19వ తేదీ నాటికే సాధారణ వర్షపాతం 153 మి.మీ.కు గాను 194.4 మి.మీ.ల మేర నమోదు కావడం విశేషం. కాగా, జిల్లా కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వరద రహదారులపైకి చేరగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పంటల సాగుపై భరోసా

ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రయోజనకరంగా మారుతున్నాయి. సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతుండడంతో భూగర్భ జలమట్టం క్రమంగా పెరుగుతోంది. అలాగే, జలాశయాలు, వాగుల్లోకి నీరు చేరుతున్న నేపథ్యాన అన్నదాతల్లో పంటలపై భరోసా ఏర్పడుతోంది. జిల్లాలో ప్రస్తుత వానాకాలం పంటల సాగు విస్తీర్ణం 5,96,662 ఎకరాలు కాగా శుక్రవారం నాటికి 2,89,082 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వానతో వరి నాట్లు జోరందుకోనున్నాయి. అలాగే, పత్తి, మిర్చి సాగు కూడా లక్ష్యాలను చేరే అవకాశముంది.

అలుగు పారుతున్న 24చెరువులు

ఖమ్మంఅర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇన్నాళ్లు వట్టిపోయిన జలాశయాలకు కళ వస్తోంది. జిల్లాలోని 984 చెరువులకు గాను శుక్రవారం నాటికి 24 చెరువులు అలుగు పారుతున్నాయి. ఇక 143 చెరువుల్లో 75 నుండి 100 శాతం మేర, 251 చెరువుల్లోకి 50 నుండి75 శాతం మేరకు, 96 చెరువుల్లో 25 నుండి 50 శాతం మేర, అంతకు తక్కువగా 470 చెరువుల్లోకి నీరు చేరిందని అధికారులు తెలిపారు. ఇక బేతుపల్లి చెరువులోకి 16 అడుగులకు గాను 17 అడుగులు, జాలిముడి ప్రాజెక్టులోకి 15 అడుగుల పూర్తి స్థాయి మట్టానికి గాను 15.24 అడుగుల మేర నీరు చేరడంతో అలుగు పోస్తున్నాయి.

పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఖమ్మంక్రైం: భారీ వర్షాల నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఒక ప్రకటనలో సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొదని తెలిపారు. కాగా, అలుగు పోస్తున్న చెరువుల కట్టలు, వరద పారుతున్న రహదారులపై ఎవరూ రాకపోకలు సాగించకుండా పోలీసు పహారా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో సాయం కోసం పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 59111కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు.

వర్షపాతం ఇలా..

కామేపల్లి మండలం లింగాలలో 43.0 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. అలాగే, గేటు కారేపల్లిలో 40.5 మి.మీ., వేంసూరులో 39.3 మి.మీ., గుబ్బగుర్తిలో 35.3మి.మీ., పంగిడిలో 33.5, పల్లెగూడెంలో 29.8, తల్లాడలో 29.3, మధిరలో 29.0, మంచుకొండలో 28.8, చింతకానిలో 28, రఘునాథపాలెంలో 27.5, తిరుమలాయపాలెంలో 26.5, రావినూతల, ముదిగొండలో 26, పెనుబల్లిలో 25.8, వైరాలో 24, ఏన్కూరులో 23.5, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 22.5 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్డించారు.





క్లుప్తంగా

ఎండిపోయిన పత్తి పైరు



ఎండిపోయిన మొక్కలను చూపుతున్న రైతు సుక్కు

కామేపల్లి: పత్తి చేనులో పెరిగిన కలుపు నివారణకు మందు పిచికారీ చేయగా... చేను మొత్తం ఎండిపోయిన ఘటన ఇది. కామేపల్లి మండలం బండిపాడుకు చెందిన రైతు జాటోత్ సుక్కు ఎకరం భూమిలో పత్తి సాగు చేయగా కలుపు పెరగడంతో పండితాపురంలోని ఓ ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి డీలర్ ఇచ్చిన మందు తీసుకొచ్చాడు. ఆ మందు పిచికారీ చేయడంతో శుక్రవారంకల్లా పత్తి మొక్కలన్నీ ఎండిపోవడంతో డీలర్ దృష్టికి తీసుకెళ్లాడు. అయితే, కలుపు మొక్కలపై తప్ప పత్తి మొక్కలపై పడకుండా జాగ్రత్త పడకపోవడంతోనే ఇలా జరిగిందని చెప్పాడు. దీంతో ఈ విషయం తనకు ముందు చెప్పలేదని, ఫలితంగా రూ.40వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు సుక్కు వాపోయాడు. ఈవిషయమై ఏఓ తారాదేవిని వివరణ కోరగా, క్షేత్ర స్థాయిలో పైరును పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాత్రలు మింగి పీఎస్‌కు వచ్చిన మహిళ

- సకాలంలో ఆస్పత్రికి తరలించిన పోలీసులు

వైరా: కుటుంబ కలహాలతో ఎక్కువ మోతాదులో మాత్రలు మింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఓ మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్తుండగా గమనించిన పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. వైరా పీఎస్‌కు శుక్రవారం ఓ మహిళ ఫిర్యాదు చేయడానికి రాగా.. స్టేషన్ ఎదుట అపస్మారక స్థితికి చేరుకుంది. ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆదేశాలతో కానిస్టేబుల్ పాషా ఆమెను పోలీస్ వాహనంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం ఆరా తీయగా ఆమె కుటుంబ కలహాల కారణంగా అధిక మోతాదుతో మాత్రలు వేసుకున్నట్లు తెలిపింది. ఈ అంశంపై పోలీసులు విచారణ చేపట్టగా, సకాలంలో స్పందించిన సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ముగ్గురి అరెస్ట్

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న కేంద్రంపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. నేలకొండపల్లిలో కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ జోరుగా సాగుతుంది. ఈ విషయమై అందిన సమాచారంతో పోలీసులు శుక్రవారం బెట్టింగ్ నిర్వహిస్తున్న కేంద్రంపై మెరుపు దాడి చేశారు. ఈమేరకు తొమ్మిది మంది ఆన్‌లైన్‌లో తంబోలా ఆటపై బెట్టింగ్ నిర్వహిరడగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.వెయ్యి నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ నాయకుడు మాదాసు ఆదాం సైతం ఉన్నాడు. కాగా, మరో ఆరుగురు పరారయ్యారని నేలకొండపల్లి ఎస్సై నాగరాజు తెలిపారు.

డబ్బు ఇవ్వలేదని సామగ్రి లాక్కెళ్లిన హిజ్రా

నేలకొండపల్లి: అడిగిన వెంటనే డబ్బు ఇవ్వలేదని ఓ గ్యారేజీలో సామగ్రిని హిజ్రా లాక్కెళ్లిన ఘటన ఇది. నేలకొండపల్లికి చెందిన ఓ గ్యారేజీకి శుక్రవారం వచ్చిన హిజ్రా డబ్బు అడిగారు. అయితే, యాజమాని లేదని గుమస్తా చెప్పడంతో ఆగ్రహించి వెంట ఉన్న ఆటో డ్రైవర్ కలిసి గ్యారేజీలో సామగ్రిని లాక్కెళ్లారు. సామగ్రిని ఆటోలో పంపించి బస్సులో వెళ్తుండగా గుమస్తా వెంట బడి ఫొటోలు తీశారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇటీవల హిజ్రాలు మండలంలోని పలు శుభ కార్యక్రమాల వద్దకు వెళ్లి గొడవ చేయడంతో పాటు వాహనాలు ఆపి డబ్బు డిమాండ్ చేస్తున్నందున పోలీసులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెనుబల్లి: మండలంంలోని లింగగూడెంకు చెందిన కంచర్ల ముత్తారావు(30) ఇటీవల పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దివ్యాంగుడైన ముత్తారావు ఇంటి వద్దే ఉంటుండగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స చేయించుకున్నాడు. ఈక్రమంలోనే 16వ తేదీన పురుగుల మందు తాగడంతో స్థానికుడు, బంధువులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్..

- ఇద్దరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని వైజాగ్‌కు చెందిన వెంకటసుజాత, మహేశ్వరరావు మండలంలోని బౌద్ధక్షేత్రం వద్ద ప్రకృతి వైద్యశాలలో చికిత్స చేయించుకునేందుకు శుక్రవారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో నేలకొండపల్లికి బయలుదేరగా, ముజ్జుగూడెం నుంచి వస్తున్న ట్రాక్టర్ తగగడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు స్థానిక ఆస్పత్రికి, ఆపై ఖమ్మం తరలించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

నిండా ముంచిన నిర్లక్ష్యం

లోపాల పుట్టగా పెద్దవాగు ప్రాజెక్టు నిర్వహణ

- ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో కుంభవృష్టితో ముంచుకొచ్చిన వరద
- ముందుగానే ప్రాజెక్టు ఖాళీ చేయడంలో వైఫల్యం
- స్థానికులు అప్రమత్తం చేసినా మేలుకోని 'ఇరిగేషన్'
- భారీ వరదకు కొట్టుకుపోయిన పెద్దవాగు ప్రాజెక్టు
- భారీగా ఆస్తి, పంట నష్టాలు, దెబ్బతిన్న రోడ్లు



వరద ఉధృతికి తెగిపోయిన పెద్దవాగు ప్రాజెక్టు కట్ట

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నలభై ఏళ్ల కిందట నిర్మించిన పెద్దవాగు ప్రాజెక్టు.. నిర్వహణలో ఇరిగేషన్ అధికారుల కారణంగా కోలుకోని నష్టం ఎదురైంది. ప్రాజెక్టు వరదలో కొట్టుకుపోగా, అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. రూ.కోట్లల్లో ఆస్తి నష్టం జరగ్గా, వందలాది మంది వరద బారిన పడ్డారు.

క్లౌడ్ బరస్ట్

పెద్దవాగు ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలో తెలంగాణలోని భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, ఏపీలోని బుట్టాయిగూడెం మండలాలు ఉన్నాయి. బుధ, గురువారాల్లో అశ్వారావుపేటలో 11 సెం.మీ., బుట్టాయిగూడెం మండలంలో 27 సెం.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. క్లౌడ్ బరస్ట్ కారణంగా గురువారం ఉదయం నుంచే పెద్దవాగులోకి భారీగా వరద చేరడం మొదలైంది. పెద్దవాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 40,500 క్యూసెక్కులు కాగా గేట్ల వద్ద గరిష్ట నీటి మట్టం ఎత్తు 18 అడుగులుగా ఉంది. అప్పటికే కురిసిన వర్షాలతో బుధవారం సాయంత్రానికి 16 అడుగులకు నీటి మట్టం చేరింది. ఎగువ కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయమే గేట్లు ఎత్తితే పరిస్థితి చేయిదాటి పోకుండా ఉండేది. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో వరద వెనక్కి మళ్లి, ప్రాజెక్టుకు ఎగువన 20 కి.మీ దూరంలో ఉన్న కావడిగుండ్ల గ్రామం వరకు ప్రభావం చూపింది.

హెచ్చరించినా...

వరద పెరుగుతోంది, ప్రాజెక్టు గేట్లు ఎత్తాలంటూ ఇరిగేషన్ అధికారులను గురువారం ఉదయమే స్థానికులు ఫోన్‌లో కోరినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉదయం 11గంటలు దాటినా గేట్లు తెరుచుకోకపోవడంతో తహసీల్దార్‌కు స్థానిక రైతులు సమస్యను వివరించారు. చివరకు మధ్యాహ్నం 12 గంటల సమయాన ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది గేట్లు ఎత్తేందుకు ప్రాజెక్టు దగ్గరకు వచ్చారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే పెరిగిన నీటి ఒత్తిడి కారణంగా గేట్లు వెంటనే పైకి లేవలేదు. మరికొందరు టెక్నీషియన్లను పిలిపించి ప్రయత్నించగా అతికష్టంపై రెండు గేట్లు ఎత్తగలిగారు. మూడో గేటు సగం తెరుచుకునే సమయానికి వరద నీరు మట్టికట్ట మీద నుంచి ప్రవహించడం మొదలైంది. ఈ వరద ఉధృతి చూసి భయపడి బతుకు జీవుడా అనుకుంటూ కొందరు టెక్నీషియన్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చివరకు ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 70వేల క్యూసెక్కులకు పైగా ఉండగా ఔట్ ఫ్లో కేవలం 4వేల క్యూసెక్కులకే పరిమితమైంది. రెండింటి మధ్యన అంతరం భారీగా పెరిగిపోవడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయింది.

ఆస్తినష్టం

పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని పదికి పైగా గ్రామాల్లో తీవ్ర ఆస్తి, పంట నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి ఎనిమిది గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు వరద విధ్వంసం కొనసాగింది. ప్రభావిత గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టకుని రాత్రంతా గడిపారు. తెలంగాణ పరిధిలో పదుల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లలోని ఫర్నీచర్, వంటసామగ్రి, గృహోపకరణాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. సుమారు 650 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. పొలాలు, తోటల్లో ఇసుకమేటలు వేశాయి. వరద ఉధృతి కారణంగా అశ్వారావుపేట మండంలో పలు గ్రామాల మధ్య రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. విద్యుత్ స్తంభాలు కూలడం, తీగల తెగిపడడమే కాక ట్రాన్స్‌ఫార్మర్లు మునిగిపోవడంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.కోటికి నష్టం వాటిల్లినట్టు అంచనా. శుక్రవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక ఏర్పాట్లను పరిశీలించారు.

అంతర్రాష్ట్ర సమస్య

వరద తీవ్రత దాటికి 300మీటర్ల మేరకు మట్టి కట్ట కొట్టుకుపోయింది. ప్రాజెక్టులో నీరంతా దిగువకు వెళ్లిపోయింది. కేవలం కాంక్రీట్ నిర్మాణం, గేట్లు మాత్రమే మిగిలాయి. తాత్కాలిక మరమ్మత్తులకే కనీసం రూ.10 కోట్లు అవుతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రాజెక్టును మళ్లీ పూర్వ స్థితికి తీసుకురావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ తెలంగాణలో ఉండగా మేజర్ ఆయకట్టు ఏపీలో ఉంది. దీంతో ప్రాజెక్టుపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. విభజన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేక ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గతేడాది రూ.కోటి వెచ్చించి మరమ్మతులు చేసినా కీలక సమయంలో గేట్లు ఎత్తకపోగా.. చివరి నిమిషంలో ప్రయత్నించినా ఫలితం కానరాలేదు. ఘటనపై ప్రాథమిక విచారణ అనంతరం నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సురేష్ కుమార్, డీఈఈ కృష్ణ, ఏఈఈ కేఎస్‌బీ.కృష్ణకు మెమోలు జారీ చేశారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్, తదితరులు

వైరా: వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కొండబోలు సురేష్ స్థానిక విద్యార్థులకు అండగా నిలుస్తుండడం అభినందనీయమని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎస్సెస్సీలో మెరుగైన జీపీఏ సాధించిన విద్యార్థులకు సురేష్ సమకూర్చిన రూ.10వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పుట్టిన గడ్డపై మమకారంతో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్న సురేష్‌ను మరికొందరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డితో పాటు బొర్రా రాజశేఖర్, కొండబోలు లలిత తదితరులు పాల్గొన్నారు. కాగా, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ జన్మదిన వేడుకలను వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించగా ఎమ్మెల్యే రాందాస్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు అశోక్, శేఖర్, నరసింహారావు, హరినాధ్, కోటయ్య, సైదులు, నాగి, రాము, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ముదిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మొదటిసారి శుక్రవారం బాణాపురం రాగా, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబరాల్లో రాయల మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేసిందని తెలిపారు. వచ్చేనెల 15వ తేదీ నాటికి రూ.2లక్షల రుణాలన్నీ మాఫీ అవుతాయని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు వట్టికూటి వెంకటేశ్వర్లు, మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, సౌజన్య, ఆవుల రమ, ఏట రాధ పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రమాద బీమా

- సహకార సంఘాల సభ్యులకు అవకాశం
- పథకంలో చేరేందుకు నేటితో ముగియనున్న గడువు

ఖమ్మంవ్యవసాయం: మత్స్యకారుల కోసం జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు సామూహిక జీవిత ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా బీమా అమలు చేస్తుండగా, మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగి 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిని అర్హులుగా నిర్ణయించారు. జిల్లాలో 210 మత్స్య సహకార సంఘాల్లో 16 వేల మందికి సభ్యత్వం ఉంది. వీరిలో అర్హులను గుర్తించి బీమా పథకంలో చేర్చడంపై అధికారులు దృష్టి సారించారు.

టీ మత్స్య పోర్టల్‌లో నమోదు

అర్హులైన మత్స్యకారుల వివరాలను జిల్లా మత్స్య శాఖ అధికారులు టీ మత్స్య పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సహకార సంఘంలో సభ్యులుగా ఉన్నట్లు ధృవపత్రంతో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్ కార్డు, పాన్‌కార్డును శనివారంలోగా సమర్పిస్తే పోర్టల్‌లో నమోదు చేస్తారు.

మరణిస్తే రూ.5లక్షలు

మత్స్యకారులు చేపలు పట్టే సమయానే కాక వాహనాలపై వెళ్తున్నప్పుడు ప్రమాదాల బారిన మృతి చెందినా, వైకల్యానికి గురైనా బీమా వర్తిస్తుంది. ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు, శాశ్వత అంగవైకల్యం చెందితే రూ.2.50 లక్షలు అందించేలా బీమా పథకాన్ని రూపొందించారు. అలాగే, ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నప్పుడు కూడా పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది.

ప్రతిఒక్కరు పథకంలో చేరాలి...

మత్స్య సహకార సంఘాల్లోని అర్హులైన సభ్యులంతా సామూహిక ప్రమాద బీమా పథకంలో చేరాలి. అవసరమైన ధ్రువపత్రాలను శనివారం లోగా మాకు సమర్పించాలి. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సభ్యుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

– డి.ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

రూ.3.50 లక్షల కరెన్సీతో సాయినాథుడికి అలంకరణ



కరెన్సీ మాలల అలంకరణలో సాయిబాబా

గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో శ్రీ వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో సాయినాథుడికి శుక్రవారం కనకాభిషేకం చేశారు. అలాగే, రూ.3.50 లక్షల విలువైన రూ.500 మొదలు రూ.20 వరకు కరెన్సీతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

– ఖమ్మంగాంధీచౌక్

బేతుపల్లి చెరువు పరిశీలన



బేతుపల్లి చెరువును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సత్తుపల్లిరూరల్: వరద ఉధృతితో నిండిన బేతుపల్లి పెద్దచెరువు అలుగు, ఆనకట్టలను శుక్రవారం నీటి పారుదల శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బేతుపల్లి చెరువు నీటి మట్టం 16 అడుగులకు గాను 17 అడుగులకు చేరడంతో అడుగు ఎత్తున అలుగు పారుతోంది. ఇన్‌ఫ్లో 4424 క్యూసెక్కులు ఉండగా.. ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కులు, ప్రత్యామ్నాయ కాల్వ నుంచి 100 క్యూసెక్కుల మేర నీటి విడుదల చేస్తున్నారు. ఈనేపథ్యాన చెరువును పరిశీలించిన అధికారులు ఎలాంటి నష్టం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక ఉద్యోగులకు సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎడతెరపి లేని వర్షంతో సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో 8వేల టన్నులు, జేవీఆర్ ఓసీలో 15వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

వాగులు.. కాలువల్లో చేపల వేట..



రుద్రాక్షపల్లి పెద్దవాగు వద్ద చేపలు పడుతున్న స్థానికులు

సత్తుపల్లిటౌన్: వర్షాలతో వాగులు, కాల్వల్లోకి భారీగా వరద చేరడంతో ప్రజలు చేపల వేటపై ఆసక్తి చూపుతున్నారు. వలలు, చీరలు, దోమతెరలతో ఉత్సాహంగా చేపలు పట్టడం కనిపించింది. రుద్రాక్షపల్లి పెద్దవాగు వద్ద గ్రామస్తులకు పెద్దసంఖ్యలో చేపలు చిక్కడంతో కిలో రూ.వంద చొప్పున అక్కడే విక్రయించారు.

మార్కెటింగ్ శాఖలో బదిలీలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. నిబంధనల మేరకు సూపర్‌వైజర్లు, బిడ్ క్లర్క్‌లు, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు(జేఎంఎస్), ఎల్‌డీసీలు, ఆఫీస్ సబార్డినేట్లు, వాచ్‌మెన్లను బదిలీ చేశారు. ఖమ్మం మార్కెట్ సూపర్‌వైజర్ విజయకుమారి వైరా మార్కెట్‌కు, వైరా సూపర్‌వైజర్ ప్రసాద్ ఖమ్మంకు, ఖమ్మం బిడ్ క్లర్క్ బాలాజీ మధిరకు, ఖమ్మం జేఎంఎస్ సామ్రాజ్యంను వైరా మార్కెట్‌కు, వైరా ఎల్‌డీసీ గీతాబాయి ఖమ్మంకు, వైరా జేఎస్‌ఎం దావీదును కల్లూరుకు, ఖమ్మం అటెండర్ భాగ్యమ్మను మద్దులపల్లి మార్కెట్‌కు, మధిరలో పనిచేసే చంద్రకళ, చలువరాజును ఖమ్మం మార్కెట్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. వీరికి శనివారం ఉత్తర్వులు అందే అవకాశముందని సమాచారం.

అధికారుల బదిలీలకు కౌన్సెలింగ్

మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ల అధికారుల బదిలీలకు శుక్రవారం హైదరాబాద్‌లో మార్కెటింగ్ శాఖ డీడీ లక్ష్మీబాయి కౌన్సెలింగ్ నిర్వహించారు. సహాయ కార్యదర్శులు మొదలు సెలక్షన్ గ్రేడ్, స్పెషల్ గ్రేడ్, గ్రేడ్–1, గ్రేడ్–2, గ్రేడ్ –3 కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, ఏడీఎంలు, డీడీఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించగా శని, ఆదివారాల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ


వేంసూరు/దమ్మపేట: పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు తీసుకున్న అర్హులైన ప్రతీ రైతుకు మాఫీ అవుతుందని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వేంసూరు మండలం మర్లపాడు, దమ్మపేట డీసీసీబీ బ్రాంచ్‌లను శుక్రవారం సందర్శించిన ఆయన పీఏసీఎస్‌ల చైర్మన్లతో మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ అవుతుందని తెలిపారు. కాగా, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు రుణాలు మంజురు చేయడంతో పాటు ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కాగా, దమ్మపేటలో చైర్మన్‌ను సత్కరించి బ్యాంకు ద్వారా రైతులకు త్వరగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్లు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, గంగ్ర సోమిరెడ్డి, కూరపాటి నాని, గడ్డం అంజిరెడ్డి, కాటే జమలరావు, ఎల్లిన రాఘవరావు, బ్యాంకు మేనేజర్ నాగభూషణం, నాయకులు రావు గంగాధరరావు, దొడ్డా ప్రసాద్, ఎర్రా వసంతరావు, యర్రగొర్ల రాధాకృష్ణ, సొసైటీ సీఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 25 వరకు 'రాయల' సంతాప సభలు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల మృతి చెందిన మాస్‌లైన్ నాయకుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభలను ఈనెల 25 వరకు వివిధ జిల్లాల్లో నిర్వహించడమే కాక, 28న ఖమ్మంలో సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో నిర్వహించే సంతాపసభకు మాస్‌లైన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్ హాజరవుతారని తెలిపారు. ఉద్యమంలో భాగమైన వారి కుటుంబాల్లో ఇబ్బందులు ఎదురవుతాయని.. వీటిని కమ్యూనిస్టులు అధిగమించి పోరాడాలన్నారు. ఉద్యమంలో పోరాటాలే తప్ప ఆత్మహత్యలు ఉండకూడదని పార్టీ భావిస్తోందని చెప్పారు. కాగా, సంతాప సభల దృష్ట్యా ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఆందోళనలను వాయిదా వేశామని, ఆగస్టు 1న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 8న కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలపడంతో పాటు 21న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తామని రంగారావు తెలిపారు. సమావేశంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను చూసేందుకు వచ్చి అనంతలోకాలకు...

జ్వరంతో బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి



ఆర్మీ జవాన్ తేజావత్ బాలాజీ (ఫైల్)

కారేపల్లి: భార్యాపిల్లలను చూసేందుకు సెలవుపై స్వగ్రామానికి వచ్చిన బీఎస్‌ఎఫ్ జవాన్ తీవ్ర జ్వరానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ తేజావత్ బాలాజీ(39) అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇండో టిబెట్ బోర్డర్ పోలీసు 9వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. స్వగ్రామంలో ఉండే భార్య, ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులను చూసేందుకు ఆయన ఈనెల 10వ తేదీన సెలవులో వచ్చాడు. ఆతర్వాతబాలాజీకి జ్వరం రావడంతో ఇల్లెందు, ఖమ్మంలో చికిత్స అనంతరం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాగా, బాలాజీ 2007లో బీఎస్‌ఎఫ్ జవాన్‌గా చేరగా.. వివిధ హోదాల్లో 17ఏళ్ల విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు, తల్లి చాంది ఉన్నారు. కాగా, జవాన్ బాలాజీ అంత్యక్రియలు సైనిక లాంఛనాలతో శనివారం స్వగ్రామంలో జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

తల్లిని చంపింది కొడుకే..

పింఛన్ డబ్బు కోసం హత్య చేసినట్లు గుర్తింపు

కారేపల్లి: నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని పెన్షన్ డబ్బుల కోసం కర్కోటకుడైన కుమారుడు హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి కారేపల్లి పోలీసులు శుక్రవారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సామ్యాతండా(భాగ్యనగర్‌తండా) గ్రామానికి చెందిన గుగులోతు సక్రి(65) ఈనెల 15వ తేదీ రాత్రి ఇంట్లో హత్యకు గురైంది. ఆమె భర్త, కొన్నాళ్ల క్రితం మృతి చెందిన సామ్యా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కావడంతో పింఛన్ డబ్బు సుమారు రూ.50వేలు వచ్చాయి. ఈ విషయం తెలిసిన వీరి పెద్దకుమారుడు, హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గుగులోతు భీముడు ఈనెల 15న సామ్యాతండాకు వచ్చాడు. ఆదేరోజు రాత్రి ఇంట్లో తల్లి సక్రితో పెన్షన్ డబ్బులు ఇవ్వాలని గొడవ పడ్డాడు. డబ్బులన్నీ అక్కచెల్లెళ్లకే ఇస్తున్నావంటూ ఘర్షణకు దిగిన భీముడు తల్లి తలపై కర్రతో కొట్టి హతమార్చి డబ్బు తీసుకుని హైదరాబాద్ వెళ్లిపోయాడు. మరుసటి రోజు సక్రి మృతి చెందినట్లు గుర్తించిన కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించగా శరీరంపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా భీముడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో శుక్రవారం ఖమ్మం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తిండిలో తొండి!

- అంగన్‌వాడీలకు అందని టీ, భోజనం నగదు

సత్తుపల్లిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని నిర్ణయించగా టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. తొలుత జిల్లాలోని 10మంది సూపర్‌వైజర్లకు మాస్టర్ ట్రెయినీలుగా శిక్షణ ఇచ్చారు. ఆపై జిల్లాలో 1,849 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1,835 మంది టీచర్లను 49 బృందాలుగా విభజించి ఇస్తున్న శిక్షణ శనివారం ముగియనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలు, ప్రాజెక్టు కేంద్రాల్లో నిర్వహించే శిక్షణ తరగతులకు టీచర్లు హాజరవుతున్నారు. వీరికి రోజుకు రెండు సార్లు టీ, స్నాక్స్, భోజనానికి రూ.120 కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో టీచర్ మూడు రోజుల పాటు శిక్షణకు వస్తుండడంతో రూ.360 చొప్పున అధికారులు చెల్లించాల్సి ఉంది. కానీ శిక్షణ చివరి దశకు చేరినా ఎవరికీ డబ్బు అందకపోవడంతో ఎదురుచూస్తున్నారు. తొలుత భోజన సదుపాయం ఉందని చెప్పినా ఆపై సొంతంగా భోజనం సమకూర్చుకోవాలని సెలవివ్వడంతో కొందరు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. మరికొందరు ఇంటి నుంచి తెచ్చుకోలేక, శిక్షణ కేంద్రాల్లో డబ్బులు అందక పస్తులతో రోజంతా గడుపుతున్నారు. అధికారులు స్పందించి ఇకనైనా టీ, స్నాక్స్, భోజనం బిల్లులు చెల్లించాలని టీచర్లు కోరుతున్నారు.

తహసీల్‌లో పెచ్చులూడి పడిన స్లాబ్



స్లాబ్ పెచ్చులూడి పడిన దృశ్యం

నేలకొండపల్లి: నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. తహసీల్‌కు రైతులు, సొసైటీ డైరెక్టర్ కనకబండి కనకరాజు తదితరులు భూమి రిజిస్ట్రేషన్ కోసం రాగా, తహసీల్దార్ చాంబర్‌లో ధరణి డేటా ఎంట్రీ ఆపరేటర్ కౌశిక్ ఫొటోలు తీస్తున్నాడు. ఇదేసమయాన స్లాబ్ పెచ్చులూడి పడడంతో రైతులు, సిబ్బంది ఉలిక్కిపడగా.. రెప్పపాటులో ఆపరేటర్ తప్పించుకున్నారు. ఈక్రమంలో తహసీల్దార్, ఇతర సిబ్బంది అప్రమత్తం కాగా, ఎవరికీ ఏం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతోనే ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది.